క్లుప్తంగా

ఆర్థిక సాయం



రాట్నాలమ్మకు సాయం అందజేస్తున్న దాతలు

నల్లజర్ల: అగ్ని ప్రమాద బాధితులకు మానవత సంస్థ ఆర్థిక సాయం అందించింది. పోతవరంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బండారి రాట్నాలమ్మకు మండల మానవత సంస్థ గురువారం రూ.5వేలు సాయం అందించింది. కార్యక్రమంలో గుళ్ళపూడి వెంకట రత్నం, మణ్యం రామచంద్రావు పాల్గొన్నారు. అలాగే గ్రామసర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు రూ.2వేలు, ఉపసర్పంచ్ ఏలేటి సత్యనారాయణ రూ.2వేలు, మణ్యం రామచంద్రావు వెయ్యి రూపాయాలు, 3 వార్డు సభ్యుడు డాక్టరు సింహాచలం బియ్యం బస్తా, రెండు దుప్పట్లు, 7వవార్డు మెంబరు చదలవాడ యేసురాజు బియ్యం బస్తా, స్టీల్ సామాను, పిచ్చుకుల శ్రీనివాస్ బస్తా బియ్యం, 2 దుప్పట్లు, నల్లజర్ల హెచ్‌పీ గ్యాస్ డీలరు బొమ్మిరెడ్డి పల్లి వెంకట రవికుమార్ 2 గ్యాస్ బండలు, స్టౌతో పాటు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మానవత సంస్థకు విరాళం



విరాళం అందజేస్తున్న విజయ్‌కుమార్

తాళ్లపూడి: మండల మానవత స్వచ్ఛంద సంస్థకు తాళ్లపూడికి చెందిన అముజూరి విజయ్‌కుమార్, సువర్ణ దంపతులు రూ.5 వేలు విరాళం అందజేశారు. అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావుకు గురువారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు గురించి తెలుసుకుని సంస్థ మరింత సేవలందించాలనే ఉద్దేశంతో ఈ మొత్తం అందజేసినట్టు తెలిపారు.

ధారవరంలో 'ఫ్యామిలీ డాక్టర్'

చాగల్లు: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందజేయడానికే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ పీఆర్ఎల్ దేవి తెలిపారు. గురువారం ధారవరంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు అభినందనలు

తాళ్లపూడి: స్థానిక ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన టీబీ వెంకట రమణను మండల వైఎస్సార్ సీపీ దళిత విభాగం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మండల ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ గూడా విజయరాజు, సర్పంచ్ గండి రాంబాబు, పిట్టా శ్రీనివాస్, వి.నంద, డాకే రాజు, ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి, రాంకి తదితరులు కలిసి పూలమాలతో సత్కరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెరవలి: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని డాన్ బాస్కో స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీతేజ్‌కుమార్ పేర్కొన్నారు. ముక్కామలలో గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు స్వీకరించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈనెల 26న అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

చాగల్లు: స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఈనెల 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో(ఎస్ఈబీ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీ వీవీ సత్యనారాయణ విద్యార్థులకు ధూమపానం, డ్రగ్స్ వినియోగం వల్ల కలుగు అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

కలెక్టర్ దృష్టికి లబ్ధిదారుల ఇబ్బందులు

దేవరపల్లి: పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలు నివాసాలకు అనుకూలంగా లేనందున వాటిని రద్దు చేసి మరొక చోట స్థలాలు ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతూ దేవరపల్లి మండలం ధుమంతునిగూడెంలోని జగనన్న కాలనీ లబ్ధిదారులు గురువారం రిలేదీక్షలు ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు సత్తి జదీశ్వరరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తి సాయిఈశ్వరరెడ్డి, ఎస్సై కె.శ్రీహరిరావు లబ్ధిదారులతో చర్చలు జరిపారు. స్థలాల సమస్యను ఎమ్మెల్యే తలారి వెంక్రట్రావు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని, సమస్య పరిష్కారానికి ఆయన కృషిచేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారుల ఇబ్బందులను గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. స్థలాల్లోకి రోడ్డు ఏర్పాటు చేసి, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్టు ఆయన తెలిపారు. త్వరలో జిల్లా కలెక్టర్ స్థలాలను పరిశీలించనున్నరని ఆయన చెప్పారు.

వరివడిగా నాట్లు

- ఖరీఫ్ పనులు ప్రారంభం
- కొవ్వూరు నియోజకవర్గంలో ముమ్మరం
- ఎత్తిపోతల పథకాలకు సాగునీరు విడుదల
- రుతు పవనాల ప్రవేశంతో కురిసిన వర్షాలు
- మెట్ట రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం

కొవ్వూరు: ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమయ్యాయి. రైతులు దమ్ములు పనుల్లో నిమగ్నమయ్యారు. డివిజన్‌లో అత్యధిక శాతం ఆయకట్టు బోర్ల కిందే సాగవుతోంది. నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, చాగల్లు, నిడదవోలు మండలాల్లో రైతులు బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. పెరవలి, ఉండ్రాజవరం మండలాలు గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలో ఉన్నాయి. ఇప్పటికే గోదావరి డెల్టా కాలువలకు నీరు విడుదల చేయడంతో వ్యవసాయ పనులు వేగం పుంజుకున్నాయి. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో ఇప్పటికే వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొవ్వూరు మండలంలో కుమారదేవం, తాళ్లపూడి మండలంలో పైడిమెట్ట, వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు విడుదల చేశారు. ఈ మూడు పథకాల ద్వారా 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఇప్పటికే నారుతీత పూర్తయిన చోట్ల రైతులు దమ్ములు చేసి నాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లోనే అధిక శాతం నారుమళ్లు, నాట్లు పడ్డాయి.

డివిజన్‌లో 68.74శాతం నారుమళ్లు పూర్తి

నైరుతి రుతు పవనాలు పలకరించాయి. రెండు రోజుల్లో జిల్లా అంతటా విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. డివిజన్ పరిధి నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లోని 40,169 హెక్టార్ల ఆయకట్టులో వరిసాగు చేస్తున్నారు. దీనికి 1,968 హెక్టార్లు నారుమళ్లు పోయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,354 హెక్టార్లలో నారు వేశారు. అంటే డివిజన్‌లో సరాసరి 68.74 శాతం నారుమళ్లు పడ్డాయి. గరిష్టంలో కొవ్వూరులో 99 శాతం, చాగల్లులో 91 శాతం, ఉండ్రాజవరం 75 శాతం, నిడదవోలు 75 శాతం నారుమళ్లు వేశారు. నల్లజర్లలో 62 శాతం పడ్డాయి. అత్యల్పంగా గోపాలపురం మండలంలో 35 శాతం నారు పోశారు. ఈ వారంలో మూడు నియోజకవర్గాల్లోను నారుమళ్ల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



తాళ్లపూడి మండలం తిరుగుమెట్టలో పొలం దమ్ము చేస్తున్న రైతు



నందమూరులో నాట్లు వేస్తున్న కూలీలు

కొవ్వూరు మండలంలో..

కొవ్వూరు మండలంలో ఇప్పటికే 810 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. చాగల్లు మండలంలో 50 ఎకరాలు, నల్లజర్లలో 22 ఎకరాలు, నిడదవోలులో 50 ఎకరాలు, తాళ్లపూడి మండలంలో 75 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. గోపాలపురంలో పది ఎకరాల్లో వెదజల్లు విధానంలో సాగు చేస్తున్నారు. మరో వైపు రుతు పవనాల ప్రభావంతో మంగళవారం డివిజన్ వ్యాప్తంగా వర్షం కురిసింది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే వచ్చే వారం నుంచి వరినాట్లు ఊపందుకునే అవకాశం ఉంది.

ఖరీఫ్ రైతుకి ఊరటనిచ్చిన వర్షం

ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముఖం చాటేశాయి. జూన్ మొదటి వారంలో కురవాల్సిన వర్షాలు మూడో వారం చివరల్లో పడ్డాయి. ఇంత వరకు ఆశించిన స్థాయిలో వర్షమే కురవలేదు. ఇప్పటికే మూడు వారాలు గడిచినప్పటికీ ఈ నెల 5, 18, 19వ తేదీల్లో చిరు జల్లులు కురిశాయి. డివిజన్ ఇప్పటి వరకు 291.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 111.8 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఈ నెల 21న డివిజన్‌లో 14.9 మిల్లీమీటర్లు, 22న 8.9 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. గడిచిన రెండు రోజుల్లో గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఉండ్రాజవరం, చాగల్లు, నల్లజర్ల తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు మరింత ఊతం నిచ్చాయి.

డివిజన్ పరిధిలో ఆయకట్టు, వరి నారుమళ్లు వివరాలు

మండలం	ఆయకట్టు హెక్టార్లు	అవసరమైన నారుమళ్లు హెక్టార్లులలో....	పోసిన నారుమళ్లు	శాతం
చాగల్లు	3,565	176	160	91
దేవరపల్లి	3,801	190	105	55
గోపాలపురం	4,123	202	70	35
కొవ్వూరు	4,747	235	232	99
నిడదవోలు	7,311	355	265	75
పెరవలి	3,381	167	105	63
తాళ్లపూడి	3,838	188	105	56
ఉండ్రాజవరం	5,008	238	178	75
న ల్లజర్ల	4,392	217	134	62
మొత్తం	40,169	1,968	1,354	68.76

జోరుగా ఖరీఫ్ పనులు

పెరవలి: ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలోని దమ్ములు ముమ్మరమయ్యాయి. కాలువ నీటితో తడిచి ముద్దయిన పుడమిని దమ్ములు చేసి పుడమి తల్లికి పచ్చనిబట్టలు వేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 36 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా ఇందులో నిడదవోలు మండలంలో 16,500 ఎకరాలు, ఉండ్రాజవరం మండలంలో 11వేల ఎకరాల్లోను, పెరవలి మండలంలో 8500 ఎకరాల్లో సాగుచేయడానికి సన్నద్ధమవుతున్నారు. ముందస్తుగా బోర్లపై తీపర్రు, ఉసులుమర్రు, కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల్లో ఆకుమడులు వేశారు. ఈ గ్రామాల్లో నాట్లు వేయడానికి ముందుగా మురగ దమ్ములు ముమ్మరంగా చేపట్టారు. అధికారులు వరినాట్లు యంత్రాలతో వేయాలని సూచిస్తున్నారు.



ఉసులుమర్రులో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

పట్టణ పరిశుభ్రతకు ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

నిడదవోలు: పట్టణ పరిశుభ్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణ శివారున దశాబ్దాలుగా సమస్యగా మారిన డంపింగ్ యార్డులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.3.29 కోట్లతో ఏర్పాటు చేసిన సమీకృత ఘన వ్యర్థాల తొలగింపు యూనిట్(లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్)ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణ, పల్లెల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారన్నారు. పట్టణ శివారున నెహ్రూనగర్‌లో 4.56 ఎకరాల్లో ఉన్న డంపింగ్ యార్డులో ప్రస్తుతం 37 టన్నుల వ్యర్థాలు నిల్వ ఉన్నాయని, లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా పట్టణంలో ఉత్పత్తయ్యే పొడి చెత్త, ఇతర వ్యర్థాలు తొలగించి అవసరాన్ని బట్టి వాటి స్థానంలో పార్కుల నిర్మాణం, ఇతర అవసరాలకు ఉపయోగపడేలా డంపింగ్ యార్డు స్థలాలను వినియోగించుకోనేలా ప్రతిపాదనలతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. డంపింగ్ యార్డులో 50 ఏళ్లగా నిల్వ ఉన్న వ్యర్థాలను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ప్లాస్టిక్, ఇనుము, గాజు, చెక్క తదితరాలను వేరు చేసి గుంటూరులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తారన్నారు. ఈప్రక్రియ ద్వారా యార్డు చుట్టు పక్కల ఉన్న నివాసులకు దుర్వాసన బాధ తప్పుతుందని తెలిపారు. యార్డులో వ్యర్థాలు తరలింపు ద్వారా వానికి ఉపశమనం లభించనుందని ఆయన పేర్కొన్నారు.



సమీకృత ఘన వ్యర్థాల తొలగింపు యూనిట్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఈ– ఆటోల ప్రారంభం

చెత్త సేకరణలో భాగంగా ప్రభుత్వం కేటాయించిన రూ.24.60 లక్షల విలువైన ఆరు ఈ–ఆటోలను ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా ఈ–ఆటోను డ్రైవ్ చేసి పారిశుధ్య కార్మికులను చైతన్యపరిచారు. పట్టణంలో ఎంవీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు ఎమ్మెల్యే బంగారుకొండ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్లు గంగులు వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, జిల్లా మైనార్టీ నాయకులు ఎస్కే వజీరుద్దీన్, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, పువ్వల రదీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, బిర్రె పార్వతి, ఎండీ షకీరాబేగం, పడాల శిరిష, అప్మాదున్నీషాబేగం, దాకే అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ కె.పద్మావతి, డీఈఈ మాదవీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.నళిని, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కే ఖాన్‌ఖాషా, ఎస్‌కే జాకీర్‌హుస్సేన్, దిరిపిన రామచంద్రరావు, తేలేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లతో చేయూత

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణీ
- మార్ట్ ఏర్పాటుపై మహిళలకు అవగాహన

నల్లజర్ల: మహిళా సమాఖ్య, సెర్ప్, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మార్ట్‌లతో మహిళలకు చేయూతనిస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణీ అన్నారు. గురువారం స్థానిక సొసైటీ సమావేశ మందిరంలో మహిళా మార్ట్‌లపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే తలారివెంకట్రావు, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణీ హాజరై మాట్లాడారు. పొదుపు సంఘాల మహిళల్లో పేద, మధ్యతరగతి వారికి చేయూతనందించేందుకు ఈమార్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. బయట మార్కెట్‌లో కొనడం కంటే ఇక్కడ కొనుగోలు చేయడం ద్వారా మంచిదన్నారు. జిల్లా అంతటా మార్ట్‌లు విస్తరింపజేయనున్నట్టు చెప్పారు. మహిళలు తయారు చేసే రెడీమేడ్, డిజైన్ వస్త్రాలు మార్ట్‌లో ఉండేలా చేస్తామన్నారు. కూరగాయలు, పరికరాలు తీసుకెళ్లడం, అక్కడి నుంచి వ్యాపార సంస్థలకు విక్రయించడం వంటి ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. ఏపీఓ నాగేశ్వరావు మాట్లాడుతూ 16 వేల మంది సభ్యులతో ఒక్కో సభ్యురాలు పెట్టుబడి రూ.250లతో రూ.40లక్షలతో ఈ మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నీరుకొండ జయకృష్ణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కలపాల వరలక్ష్మి, సభ్యులు గుత్తికొండ సత్యవతి, ఊబ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



మహిళా మార్ట్ ఏర్పాటుపై సభ్యులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పీడీ సుభాషిణి

అవినీతికి దూరంగా జగన్ పాలన

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- వెలగదుర్రులో గడపగడపకూ మన ప్రభుత్వం

ఉండ్రాజవరం: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలలో ఇప్పటి వరకూ అవినీతి జరగలేదని, ఇదే జగన్ పారదర్శక పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. వెలగదుర్రు గ్రామంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కుల, మత రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ, సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు ధనిశెట్టి భ్రమరాంబ, ముదునూరి సతీష్‌వర్మ, సాగి రామకృష్ణంరాజు, ఇందుకూరి మురళీ కృష్ణంరాజు, బోళ్ళ శ్రీను, గోపి పెద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెలగదుర్రులో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు



చాగల్లులో మాట్లాడుతున్న గౌరీశంకర్

చాగల్లు: ఉత్తమ ఫలితాలు సాధనే లక్ష్యంగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్ అన్నారు. గురువారం చాగల్లు, బ్రహ్మణగూడెం హైస్కూళ్లను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆణిముత్యాలు పేరుతో నగదు ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. ఆణిముత్యాలు సాధించాలనే లక్ష్యంతో ఏకాగ్రతతో ప్రతిరోజు చక్కగా చదువుకోవాలన్నారు. అనంతరం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, ఎంఈవోలు వి.ఖాదర్‌బాబు, సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నల్లజర్ల: లైన్లు షిఫ్టింగ్ కారణంగా తెలికిచెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అన్ని ఫీడర్లకు సప్లయి నిలిపివేయనున్నట్టు తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరావు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నంగా ఒంటి గంట వరకూ కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఒకటి నుంచి 'జగనన్న సురక్ష'

కొవ్వూరు: జూలై ఒకటో తేదీ నుంచి 21వ తేదీ వరకూ మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించునున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ప్రజల నుంచి అందిన అభ్యర్థనలు స్వీకరించి వాటికి సత్వర పరిష్కారం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జూలై ఒకటిన చిడిపి, కాపవరం, 4న కుమారదేవం, దొమ్మేరు–1లో కార్యక్రమం జరుగుతుందన్నారు. 6న ఆరికిరేవుల, దొమ్మేరు–2, 7న పెనకనమెట్ట, ఐ.పంగిడి, 11న ధర్మవరం, ఐ.పంగి డి–2, 13న వాడపల్లి–1, వేములూరు, 14న వాడపల్లి–2, తొగుమ్మి సభలు నిర్వహిస్తామన్నారు. 18న సీతంపేట, 20న మద్దూరు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో ఈవో పీఆర్అండ్ ఆర్‌డీ కేవీవీఎస్‌యూఎం శర్మ, సీఎస్‌డీటీ బాపిరాజు టీముగా ఉండి ఈ సభలు నిర్వహిస్తారన్నారు. మరో టీంలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్ కె.అజయ్‌బాబు, ఎంపీడీవో కార్యాలయంలో ఏవో కేపీవీఎస్ ప్రసన్నకుమార్ మరో టీముగా వ్యవహరిస్తారన్నారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి



సమిశ్రగూడెంలో రైతులకు విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు నందకిషోర్, అచ్యుతరావు

నిడదవోలు రూరల్: రైతులంతా ఖరీఫ్‌లో ఎరువులు తక్కువగా వినియోగించాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయం ఏరువాక కేంద్రం (రాజమహేంద్రవరం) శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.నందకిషోర్, డాక్టర్ కె.అచ్యుతరావు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం ఆర్‌బీకే కేంద్రాలను గురువారం వారు పరిశీలించారు. ఖరీఫ్ వరిసాగులో వచ్చే చీడ పీడ పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. బీపీటీ 3082 వరి వంగడాన్ని ప్రయోగాత్మకంగా సాగుచేయాలని చిరు సంచితో విత్తనాలను రైతులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఓ జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు కె.శివనాగు, మాధవన్, రైతులు కస్తూరి సాగర్, కోటి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు

ప్రకాశం నగర్: ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో రినోవేషన్ చేయించిన జగనన్న ఎంఎస్ఆర్ ఐసీయూ కేర్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడి వృద్ధుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా వైద్యవిభాగాన్ని రినోవేషన్ చేయించి కావాల్సిన సౌకర్యాలు కల్పించామన్నారు. రెండు ఆక్సిజన్ యూనిట్లు, రెండు ఏసీలు, నాలుగు బెడ్లు, 6 సెలైన్ స్టాండ్లు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని చూసుకునేందుకు కళాధర్ అనే వ్యక్తిని ఏర్పాటు చేయించామన్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు సకాలంలో అన్ని వైద్య సేవలందించామన్నారు. ఐసీయూ కేర్ తమను సంజీవనిలా ఆదుకుందని వృద్ధులు చెబుతుంటే సంతోషంగా ఉందన్నారు.

పచ్చిరొట్టతో భూమికి బలం

- జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి రామకృష్ణ


పెరవలి: పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతమై పంటకు బలం చేకూరుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలోని అన్నవరప్పాడు, పిట్టల వేమవరం గ్రామాల్లో గురువారం పంట చేలను పరిశీలించి రైతులతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పెరవలి మండలంలో పచ్చిరొట్ట సాగు 1800 ఎకరాల్లో రైతులు చేపట్టారని ఇందులో పిల్లిపిసర, మినుము, పెసలు, జనుము, జీలుగ వంటి పంటలు వేశారన్నారు. దీని వల్ల ఎకరం పంటలో ఈ పంటల వేయడం ద్వారా రైతులకు మూడో పంటగా ఆదాయం సమకూరడంతో పాటు చేనుకు 10 టన్నుల ఎరువు లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు సాగు చేసే రైతులు కషాయాలు వినియోగించటం వల్ల నాణ్యమైన ఉత్పత్తులు పొందవచ్చని తెలిపారు. మండలంలో 2వేల ఎకరాల్లో ప్రకృతి సాగుకు ప్రణాళికలు రూపొందించామని అందుకు రైతులను సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమా మహేశ్వరరావు, చిత్రపు వెంకటరావు, పొట్టి విద్యాలత, బొక్కా శ్రీనివాస్, పాల సూర్యనారాయణ, రైతులు అవినాష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నవరప్పాడులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఉండ్రాజవరం: భారతీయ రిజర్వు బ్యాంకు ఏపీ ఆధ్వర్యంలో ఆర్థిక సమీకృత, ఆర్థిక విభాగం అనే అంశంపై స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్విజ్ పోటీల్లో సత్యవాడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రథమ స్థానం, ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ద్వితీయ స్థానం, వడ్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తృతీయ స్థానం సాధించారు. వీరికి ప్రశంసా పత్రంతో పాటు ఒక్కొక్కరికి వారి బ్యాంక్ అకౌంట్లో రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి జమ చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం యూనియన్ బ్యాంకు శాఖకు చెందిన ఆర్‌డీవో జి.లక్ష్మణ్, సబ్ మేనేజర్ సీహెచ్ కిరణ్‌కుమార్‌లు ఆర్గనైజర్‌గా వ్యవహరించారు. ఈసందర్భంగా విజేతలను పాఠశాల హెచ్ఎం వి.విశ్వప్రసాద్, పాఠశాల కమిటీ చైర్మన్ కరెళ్ళ సోంబాబు అభినందించారు.



క్విజ్ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న హెచ్ఎం విశ్వప్రసాద్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com